ప్రైవేట్ దవాఖానను ప్రారంభించిన ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ, డిసెంబర్ 23 : బాన్సువాడలో ఏర్పాటు చేసిన ఓ ప్రైవేట్ దవాఖానను మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి శనివారం ప్రారంభించారు. దవాఖానలో పూజలు నిర్వహించారు.

కొనసాగుతున్న పదో తరగతి పరీక్షలు

రామారెడ్డిలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో రాజు

కామారెడ్డి/బీబీపేట్/ దోమకొండ/ రామారెడ్డి/ పిట్లం, మార్చి 23 : జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం గణితం పరీక్ష ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు కొనసాగింది. మొత్తం 11,962 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 11,939 మంది హాజరయ్యారు. 23 మంది గైర్హాజరయ్యారని డీఈవో రాజు తెలిపారు. ఎనిమిది మంది ప్రైవేటు విద్యార్థులకుగాను ఐదుగురు హాజరుకాగా ముగ్గురు గైర్హాజరయ్యారని తెలిపారు. బీబీపేట్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. (ఎ) సెంటర్‌లో 180 మంది విద్యార్థులు, (బి) సెంటర్‌లో 170 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మాందాపూర్‌లో ఏర్పాటు చేసిన సెంటర్‌లో 104 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ఎంఈవో కార్యాలయ సిబ్బంది తెలిపారు. దోమకొండలో బాలుర ఉన్నత పాఠశాలలో 162 మంది విద్యార్థులు, బాలికల ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ఎంఈవో కార్యాలయ సిబ్బంది తెలిపారు. రామారెడ్డిలో ఏర్పాటుచేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖాధికారి రాజు శనివారం సందర్శించారు. పరీక్షా కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులకు తాగునీ టి వసతి కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. మాస్ కాపీయింగ్ జరుగకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని పరీక్షల నిర్వహణ అధికారి ఆనంద్‌రావును ఆదేశించారు. ఆయనవెంట మండల విద్యాశాఖాధికారి యోసెఫ్ ఉన్నారు. పిట్లంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో పరీక్షకు నలుగు రు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో దేవీసింగ్ తెలిపారు. 519 మందికి 515 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు.

పంట నష్టం వివరాల సేకరణ

బాన్సువాడ రూరల్/రాజంపేట/భిక్కనూర్, మార్చి 23 : మండలంలోని కొల్లూరు గ్రామంలో పంట నష్టం వివరాలను శనివారం ఏఈవో రాణి, పంచాయతీ కార్యదర్శి సృజరెడ్డి సమక్షంలో రైతులతో కలిసి నమోదు చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షానికి చేతికొచ్చిన వరి పంటకు నష్టం వాటిల్లింది. ఈ సందర్భంగా ఏఈవో మాట్లాడుతూ.. పంట నష్టం వాటిల్లిన రైతుల వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. గ్రామంలోని రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేసినట్లు ఆమె తెలిపారు. గ్రామపెద్దలు వెంకట్రాంరెడ్డి, దుర్గారెడ్డి, రైతులు పాల్గొన్నారు. రాజంపేటలో మండల వ్యవసాయాధికారిణి సుప్రజ్యోతి వివరాలు సేకరించి పైఅధికారులకు నివేదికలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు. భిక్కనూర్‌లో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా కన్వీనర్ రవీందర్ కోరారు. ఈ మేరకు సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ప్రధాన కూడళ్లలో కనిపించని సూచిక బోర్డులు

- వాహనదారులకు తప్పని తిప్పలు
- పలుచోట్ల ప్రమాదాలు

డోంగ్లీలో సూచిక బోర్డులు లేని రహదారులు

డోంగ్లీ, మార్చి 23: ప్రధాన రహదారులపై పలు ప్రదేశాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఏ దారి ఎటు పోతుందో తెలియని పరిస్థితి నెలకొనడంతో ప్రయాణికులు తికమకపడుతున్నారు. ప్రధాన కూడళ్లు, మూల మలుపుల వద్ద ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉండగా.. మండలంలోని పలు ప్రాంతాల్లో బోర్డులు లేక వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. ' ఈ దారి ఎటు వైపునకు వెళ్తున్నది..? ఎన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్నది..?' తెలిపే బోర్డులు ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఆ రహదారి వెంట కొత్తగా వెళ్లే ప్రయాణికులు సైతం ఎలాంటి ఇబ్బంది లేకుండా తమ ప్రయాణాన్ని సాగించవచ్చు. రోడ్డు మలుపుల వద్ద కూడా హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా యి. రాత్రి సమయంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మండలంలోని పలు ప్రధాన కూడళ్లు, మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన ఆర్డీవో

ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో రాథోడ్ రమేశ్

బాన్సువాడ రూరల్, మార్చి 23 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బాన్సువాడ మండలం దేశాయిపేట్ గ్రామంలోని ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులను నిర్వహించేందుకు తరగతి గదులతో పాటు ఈవీఎంలు భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌లను ఆర్డీవో రాథోడ్ రమేశ్ శనివారం పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్ట్రాంగ్‌రూంలను పరిశీలించినట్లు ఆర్డీవో తెలిపారు. కళాశాలలో మౌలిక సదుపాయాలపై తహసీల్దార్ వరప్రసాద్‌తో చర్చించారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ ఉన్నారు.

మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలి

బాన్సువాడ, మార్చి 23 : పట్టణంలోని ప్రజలకు తాగునీటిని అందించే ఫిల్టర్ బెడ్‌ను మున్సిపల్ చైర్మన్ గంగాధర్ విద్యుత్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ అలీంతో కలిసి శనివారం పరిశీలించారు. ఫిల్టర్ బెడ్‌లో విద్యుత్ వైర్ల మరమ్మతుల గురించి ట్రాన్స్‌కో అధికారులకు వివరించారు. అనంతరం నల్లాల బావి నుంచి నీటిని సరఫరా చేసే మోటర్ల రిపేరింగ్ పనులను పరిశీలించారు. వెంటనే విద్యుత్ మోటర్ల మరమ్మతు పనులను పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ అధికారులకు సూచించారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉదయ్‌గుప్తా, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కామారెడ్డి రూరల్/నిజాంసాగర్, మార్చి 23 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నేటి యువత భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరున్, ఎస్ఎఫ్ఐ నాయకులు మణికంఠ, సాయికృష్ణ, విష్ణు, శ్రీకాంత్, రాజ్‌కుమార్, సంతోష్ పాల్గొన్నారు. జుక్కల్‌లోని వివేకానంద పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్, జుక్కల్ నియోజకవర్గ అధ్యక్షుడు సాగర్, మండల అధ్యక్షుడు షేక్ ఫిర్దోస్, నాయకులు విలాస్, నవీన్, అభిషేక్, నాగరాజు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కామారెడ్డి రూరల్, మార్చి 23 : జిల్లా కేంద్రంలో కామారెడ్డి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కోల శ్రీకాంత్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా చింతల గోపి, ప్రధాన కార్యదర్శిగా బండారు సురేందర్‌రెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన న్యాయవాది అమృతరావు తెలిపారు.

విద్యార్థినికి పుస్తకాలు అందజేత

కామారెడ్డి రూరల్, మార్చి 23 : జిల్లా కేంద్రంలో శ్రీరామ సేవా సమితి ఆధ్వర్యంలో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థిని స్వర్ణ తండ్రి శ్రావణ్‌కు శనివారం పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. లింగంపేట్ మండలం అయ్యవాని తండాకు చెందిన స్వర్ణకు నాలుగో సంవత్సరానికి సంబంధించిన సుమారు రూ.10,150 విలువైన పుస్తకాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్సింహులు, ఉప్పల గిరిధర్, లాభిశెట్టి కిషన్, సునీల్, సురేశ్, చేపూరి చంద్రశేఖర్, పప్పుల శ్రీనివాస్, మామిడి శ్రీనివాస్, ఎల్లంకి కృష్ణ, మోటుకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు

అమెరికాలో కాన్ఫరెన్స్‌కు విద్యార్థి ఎంపిక

విద్యార్థిని సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

కామారెడ్డి, మార్చి 23 : అమెరికాలో నిర్వహించే ఇంటర్నేషనల్ స్పేస్ డెవలప్‌మెంట్ కాన్ఫరెన్స్‌కు కామారెడ్డికి చెందిన శ్రీమాన్ చారి ఎంపికయ్యాడు. శ్రీచైతన్య పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న శ్రీమాన్ పలు పరిశోధనలు చేశాడు. మే నెలలో అమెరికాలో ఇంటర్నేషనల్ స్పేస్ డెవలప్‌మెంట్ కాన్ఫరెన్స్ ఆధ్వర్యంలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శనకు శ్రీమాన్ చారి ఎంపికకాగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవితేజ అభినందించారు.

రేపు సామూహిక సత్యనారాయణ వ్రతం

బీబీపేట్, మార్చి 23 : మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి దేవాలయంలో ఉదయం 10 గంటలకు తిరుపతి దేవస్థానం తరపున సోమవారం ఉచితంగా సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్నట్లు వాసవి క్లబ్ ప్రతినిధి బాశెట్టి నాగేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం పూజ సామన్లు, కొబ్బరికాయ తీసుకొని రావాలన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ పేర్లను బాగాగౌడ్‌ను సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు.

పాఠశాలలో హోలీ వేడుకలు

హోలీ సంబురాల్లో పాల్గొన్న విద్యార్థులు

మాచారెడ్డి/నిజాంసాగర్, మార్చి 23 : మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం ముందస్తు హోలీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సహజ సిద్ధమైన రంగులతో హోలీ సంబురాలుచేసుకున్నారు. పండుగా విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని సంబురాలు చేసుకున్నారు. నిజాంసాగర్‌లోని బంజరాహిల్స్ కాలనీలో ఉన్న అంగన్‌వాడీలో టీచర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో కామదహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులు రంగులు చల్లుకుంటూ ఆనందంగా పండుగలో పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్సై సుధాకర్

సీసీ కెమెరాలు ప్రారంభం

నిజాంసాగర్, మార్చి23: మహ్మద్‌నగర్ మండలంలోని గున్కుల్ గ్రామంలో శనివారం ఎస్సై సుధాకర్ సీసీ కెమెరాలను ప్రారంభించారు. దొంగతనాల నివారణ, గ్రామంలో ఎలాంటి అల్లర్లు జరగకుండా ఉండేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులందరూ కలిసి నిధులు సమకూర్చుకున్నారు. వాటితో గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా.. అందుకు సంబంధించిన పరికరాలను గ్రామ పంచాయతీ కార్యాలయంలో అమర్చారు. సీసీ కెమెరాలను ఎస్సై ప్రారంభించి మాట్లాడుతూ.. గ్రామస్తులందరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని అన్నారు. సీసీ కెమెరాను ఏర్పాటు చేసుకోవడానికి అన్ని గ్రామాల ప్రజలు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు గంగి రమేశ్, మాలిష్ రాజు, పోలీస్ రాజు, సాయాగౌడ్, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురాతన బురుజుల కూల్చివేత



బురుజును కూలుస్తున్న పొక్లెయిన్

మద్నూర్, మార్చి 23: మండల కేంద్రంలోని పురాతన బురుజులను అధికారులు కూల్చివేయిస్తున్నారు. ఏండ్ల క్రితం నిర్మించిన బురుజులు శిథిలావస్థకు చేరుకున్నాయి. అవి కూలితే ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నదని గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో బురుజులను కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఇటీవల పరిశీలించారు. బురుజులను కూల్చివేయాలని పంచాయతీ ప్రత్యేకాధికారి డాక్టర్ విజయ్‌కుమార్‌కు ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది పొక్లెయిన్ సహాయంతో శనివారం బురుజులను కూల్చివేయడం ప్రారంభించారు.

రాతి కట్టడంతో

అంబరీశుడి ఆలయ నిర్మాణం

రాతి స్తంభాలతో నిర్మిస్తున్న ఆలయం

సదాశివనగర్, మార్చి 23: మండలంలోని భూంపల్లి గ్రామ శివారులో దాతల సహకారంతో అంబరీశుడి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. రాతి కట్టడంతో ఆలయాన్ని నిర్మిస్తుండడం గమనార్హం. ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు సంకల్పించి, కావాల్సిన నిధుల కోసం దాతలను సంప్రదించారు. పలువురు విరాళాలు అందజేయడంతో ఆలయాన్ని అందంగా నిర్మిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. నిర్మాణం పూర్తికాగానే పెద్ద ఎత్తున పూజలు చేసి ఆలయాన్ని ప్రారంభిస్తామని అన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I,NOMULA PEDDA GANGA REDDY S/O NOMULA GANGARAM, R/o.H.No.1-72, Pachalanadkuda,Velpur(M),Nzb(D),Changed My Name As NOMULA GANGA REDDY
NTZ-324634

SERVICES

★మీరు కోర్టు కేసులతో బాధ పడుతున్నారా? NOC ఇబ్బందులు ఉన్నాయా? మీ కేసులు మీరే వాదించుకోండి. మేము మీకు న్యాయ సలహాలు ఇస్తాము. GLS, L.B.Nagar, Hyd. 7893011777.
NT-311873-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
" పేరు మార్పిడి " ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్ : 9182777590

WANTED

★ఇంటర్, డిగ్రీ చదివి ఖాళీగా ఉన్న వారికి కంప్యూటర్ & ఇంగ్లీష్ కోర్సులు నేర్పి, కార్పొరేట్ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు చూపించబడును. 7997997364/5.
NT-327958

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రైతులు పశు సంపదపై దృష్టి సారించాలి

ఐలాపూర్‌లో గొర్రెల షెడ్డును పరిశీలిస్తున్న రైతులు

సదాశివనగర్, మార్చి 23: రైతులు పంటల సాగుతోపాటు పశు సంపదపై దృష్టి పెట్టాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎదురుగట్ల సంపత్‌గౌడ్, సదాశివనగర్ మాజీ జడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్‌రావు అన్నారు. లింగంపేట మండలంలోని ఐలాపూర్ గ్రామంలో గొర్రెల షెడ్డును సదాశివనగర్ మండల రైతులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు గొర్రెలు, చేపలను పెంచుతూ ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. పశు సంపద పెంచేందుకు బ్యాంకులు రుణాలను అందిస్తున్నాయని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గోకుల్‌తండా లింబాద్రినాయక్ తదితరులు పాల్గొన్నారు.



వొడ్డెపల్లి నర్సరీలో దర్శనమిస్తున్న పిచ్చిమొక్కలు

నర్సింగ్‌రావుపల్లిలో నర్సరీ ఇలా..

తున్కిపల్లిలో మొలకెత్తని మొక్కలు

నీరుగారుతున్న లక్ష్యం

నర్సరీలలో పెంపకం చేస్తున్న మొక్కల్లో సగం కూడా చేతికి అందేలా లేవు

నిజాంసాగర్, మార్చి 23: ప్రభుత్వం రానున్న వర్షాకాలంలో గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటేలా లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ముందుకు సాగుతున్నది. గ్రామాల్లో నాటేందుకు కావాల్సిన మొక్కలు ఆయా గ్రామాల్లోనే సిద్ధం చేసుకునేలా ఏర్పాట్లు చేసింది. మూడు నెలల క్రితం ఉపాధి హామీ పథకంలో భాగంగా నర్సరీలను ఏర్పాటు చేసింది. నిజాంసాగర్ మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతి గ్రామానికీ ఒకటి చొప్పున మొత్తం 27 నర్సరీలను ఏర్పాటు చేశారు. ఒక్కో నర్సరీలో పది వేల మొక్కలను సిద్ధం చేసేలా ప్రణాళికలు రూపొందించారు. మూడు నెలల క్రితమే నర్సరీలకు అవసరమైన ప్లాస్టిక్ కవర్లు, ఎర్ర మన్ను, విత్తనాలను సరఫరా చేశారు.

పదివేల మొక్కలను సిద్ధం చేసేలా..

మండలంలోని ప్రతి నర్సరీలో పది వేల మొక్కలు జూన్ నాటికి నాటేందుకు సిద్ధం చేసేలా ఏర్పాట్లు చేశారు. నర్సరీలకు ఐదు వేల మొక్కలు, ఐదు వేల స్టంప్స్ సమకూర్చారు. వాటిలో గులాబీ, మందార, టేకో పాతోపాటు వివిధ రకాల పూలు, పండ్లు, ఇతర మొక్కలు ఉన్నాయి. వీటి సంరక్షణ కోసం వన సేవకుడిని నియమించారు. ప్రతి రోజూ మొక్కలకు నీటిని అందించడం, కూలీలతో పిచ్చి మొక్కలు తొలగించడం, మొక్కలను సంరక్షించేలా పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పర్యవేక్షిస్తున్నారు. మండలంలో 2.70లక్షల మొక్కలు జూన్ నాటికి సిద్ధం చేయాల్సి ఉండగా నర్సరీలపై పర్యవేక్షణ కరువు, నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఒక్కో నర్సరీలో ఐదు లక్షల మొక్కలు కూడా వానకాలం నాటిని సిద్ధం అయ్యేలా కనిపించడం లేదు. చాలా వరకు స్టంప్స్ మొలకల జాడ లేకుండా పోయింది. పిచ్చి మొక్కలు పెరిగినా.. వాటిని తొలగించిన దాఖలాలు లేవు. మొక్కలకు నీటిని అందించకపోవడంతో అవి పెరగడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతున్నది. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అన్ని నర్సరీలను పరిశీలిస్తా..

మండలంలో 2.70 లక్షల మొక్కలను జూన్ నెలలో నాటేలా లక్ష్యాన్ని నిర్దేశించుకొని మొత్తం 27 నర్సరీలను ఏర్పాటు చేశాం. అయితే నర్సరీల్లో మొక్కలు ఎండిపోయిన విషయం నాకు తెలిసింది. వెంటనే గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటా. మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచిస్తా.

-శ్రీనివాస్, ఏపీవో. నిజాంసాగర్

హజ్ యాత్రికులకు సన్మానం

బిచ్కుంద, మార్చి 23: బిచ్కుందకు చెందిన సీనియర్ నాయకుడు పాషాసేట్‌తోపాటు పలువురు హజ్ యాత్రకు బయల్దేరి వెళ్లారు. వారిని బిచ్కుంద నాయకుడు అసద్‌అలీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ ఖాన్‌సాబ్, ఉస్మాన్‌సేట్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

పెద్దకొడప్‌గల్, మార్చి 23: మండలంలోని బేగంపూర్, బేగంపూర్ తండాలో పశువులకు శనివారం టీకాలు వేశారు. రెండు గ్రామాల్లో కలిపి 102గేదెలు, 110 ఆవులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్య సిబ్బంది సురేశ్ తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు టీకాల పంపిణీ ఉంటుందన్నారు.

వందశాతం పన్ను వసూలు చేయాలి

పిట్లం, మార్చి 23: ఇంటి, వ్యాపార సముదాయాల వారు వందశాతం పన్ను చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని పంచాయతీ కార్యదర్శి యాదగిరి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పన్ను వసూలు కోసం శనివారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. కార్యక్రమంలో బసంత్, ప్రవీణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

రామారెడ్డి, మార్చి 23: మండలంలోని స్కూల్ తండా నుంచి రెడ్డిపేట గ్రామానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు ఘన్‌పూర్ రోడ్డు వద్ద శనివారం పట్టుకున్నారు. ప్రభుత్వ అనుమతి లేనిదే ఇసుకను తరలిస్తుండడంతో మూడు ట్రాక్టర్లపై కేసు నమోదు చేశామని ఎస్సై విజయ్ తెలిపారు.

చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ

సదాశివనగర్, మార్చి 23: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని దగ్గి స్టేజీ వద్ద పోలీసులు చెక్ పోస్టును ఏర్పాటుచేశారు. సదాశివనగర్ సీఐ సంతోష్‌గౌడ్, ఎస్సై రాజు తమ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. వాహనదారులు ఎన్నికల నిబంధనలను పాటిస్తూ.. పోలీసులకు సహకరించాలని వారు కోరారు.

బీజేపీ కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడిగా సంజీవులు

గాంధారి, మార్చి 23: బీజేపీ కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడిగా కూచి సంజీవులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. పేట్ సంగెంలో నిర్వహించిన సమావేశంలో అతడి ఎన్నిక జరిగింది. సంజీవులును పలువురు అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ నాయకుడు అశోక్, మండలాధ్యక్షుడు మధుసూదన్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.